# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 03-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ డిజిటల్ యుగంలో అందుబాటులో ఉన్న విస్తారమైన అభ్యాస వనరులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం న్యూఢిల్లీలో సమావేశమైంది.
- ❖ విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ జర్మన్ విదేశాంగ మంత్రి జోహన్ డేవిడ్ వాడేఫుల్‌తో న్యూఢిల్లీలో సమావేశమై చర్చలు జరిపారు.
- ❖ జి.ఎస్.టి. కౌన్సిల్ 56వ సమావేశం న్యూఢిల్లీలో ప్రారంభమైయింది.

==============================

డిజిటల్ యుగంలో అందుబాటులో ఉన్న విస్తారమైన అభ్యాస వనరులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. ఈరోజు తిరువాళూర్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడులో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. 45 మంది పట్టభద్రులకు బంగారు పతకాలను, 44 మందికి డాక్టరేట్లను రాష్ట్రపతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నేర్చుకోవడం, జ్ఞానాన్ని పెంచుకోవడం విద్య యొక్క ప్రాముఖ్యత అని అన్నారు. సమాజ వృద్ధికి క్రియాశీలక సహకారాన్ని అందించాలని విద్యార్థులకు రాష్ట్రపతి పిలుపునిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు కేంద్ర మంత్రివర్గం న్యూఢిల్లీలో సమావేశమైంది. దేశంలో కీలకమైన ఖనిజాలను ద్వితీయ వనరుల నుండి వేరు చేసి ఉత్పత్తి చేయడానికి, రీసైక్లింగ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి 1,500 కోట్ల రూపాయల ప్రోత్సాహక పథకాన్ని మంత్రివర్గం ఆమోదించింది. ఈ పథకం నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ (NCMM)లో భాగంగా ఉంటూ.. కీలకమైన ఖనిజాల దేశీయ సామర్థ్యాన్ని, సరఫరా గొలుసు పెంపొందించడం లక్ష్యంగా

పెట్టుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం నుండి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకానికి 6 సంవత్సరాల కాలపరిమితిని నిర్ణయించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ ఈరోజు న్యూఢిల్లీలో జర్మన్ విదేశాంగ మంత్రి జోహన్ డేవిడ్ వాడేఫుల్‌తో చర్చలు జరిపారు. అనంతరం సంయుక్త పాత్రికేయుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ... యూరోపియన్ యూనియన్‌తో భారతదేశ సంబంధాలను మరింతగా పెంచుకోవడానికి, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చలను వేగవంతం చేయడానికి జర్మని సహకరించాలని కోరారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం కోసం వివిధ కోణాలలో లోతైన చర్చ కోసం ఎదురు చూస్తున్నానని జైశంకర్ తెలియజేస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జవాన్ల ధైర్యం, పరాక్రమం, నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా గుర్తుండిపోతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్టల వద్ద ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించిన CRPF, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, DRG, కోబ్రా సిబ్బందిని అమిత్ షా ఈరోజు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతికూల వాతావరణం, అడుగడుగునా IEDల ప్రమాదం ఉన్నప్పటికీ, భద్రతా దళాలు సాహసంతో నక్సలైట్ల బేస్ క్యాంప్‌ను ధ్వంసం చేసి ఆపరేషన్‌ను విజయవంతం చేశాయని ప్రశంసించారు. భారత్ నక్సల్ రహితంగా మారే వరకు కేంద్ర  ప్రభుత్వం విశ్రమించదని స్పష్టం చేశారు. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో తీవ్రమైన గాయాలపాలైన భద్రతా దళాల జీవితాలు సజావుగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అమిత్  షా భరోసా ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలోని యశోభూమిలో ఈరోజు జరిగిన సెమికాన్ ఇండియా 2025 సమావేశంలో CEOల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. సెమికండక్టర్ రంగంలోని నిపుణులతో నరేంద్రమోదీ సంభాషించారు. సెమికండక్టర్స్ కు సంబంధించిన వివిధ ఉత్పత్తులు, ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో  కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్  పాల్గొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జిఎస్‌టి కౌన్సిల్ 56వ సమావేశం న్యూఢిల్లీలో ఈ రోజు ప్రారంభమైయింది. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నారు. పన్ను రేట్ల హేతుబద్ధీకరణ వంటి జిఎస్‌టి సంస్కరణలపై కౌన్సిల్ చర్చించనుంది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఢిల్లీ, గోవా, హర్యానా, జమ్మూ కాశ్మీర్, మేఘాలయ ఒడిశా ముఖ్యమంత్రులు, పలు రాష్ట్రాల ఉప ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జీఎస్టీ రంగంలో ప్రధాన సంస్కరణలకు తమ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. ఈ సంస్కరణలు ఎక్కువగా సామాన్యులకు, పేదలకు సహాయపడతాయని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 19 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ, యూరోపియన్ యూనియన్ సహకారంతో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ రోజు భారతదేశం కోసం సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (SAF) ఫీజిబిలిటీ నివేదికను విడుదల చేసింది. ఆ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతదేశం తన సొంత స్థిరమైన విమాన ఇంధనం లభ్యత డిమాండ్‌ను తీర్చగల సామర్థ్యాన్ని కలిగి ఉండటమే కాకుండా ఎగుమతిదారుగా కూడా ఉద్భవించగలదని అన్నారు. ఈ నివేదిక విమానయాన రంగంలో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ఆచరించదగ్గ తక్షణ పరిష్కారం అని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఈరోజు తొమ్మిది మంది మహిళలు సహా ఇరవై మంది మావోయిస్టులు లొంగిపోయారు. సిఆర్‌పిఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజేష్ కుమార్ పాండే, పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్, ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో వారు లొంగిపోయారు. వారిపై ముప్పై మూడు లక్షల రూపాయల రివార్డు ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సుస్థిర జాతీయ రహదారుల అభివృద్ధి కోసం, విధాన రూపకల్పనపై జరిగిన సంప్రదింపుల సమావేశం న్యూఢిల్లీలో ఈరోజు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరిగింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంతాలలో రద్దీని తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రపంచ స్థాయి రవాణా మౌలిక సదుపాయాలను సృష్టించడంపై ఈ సమావేశంలో చర్చించారు. నగర కేంద్రాల నుండి ట్రాఫిక్‌ను మళ్లించి, పట్టణ, జాతీయ రహదారుల రద్దీని తగ్గించడానికి రింగ్ రోడ్లు, బైపాస్‌ల నిర్మాణంతో సహా పలు వినూత్న విషయాలపై చర్చించారని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యా చమురు, ఇతర వస్తువుల దిగుమతులపై అమెరికా ఒత్తిడికి తలొగ్గకపోవడంపై భారతదేశపు వైఖరిని రష్యా ప్రశంసించింది. ఇండోనేషియా వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ భారతదేశపు చర్యలు స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలకు కట్టుబడి ఉంటాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సెమీకండక్టర్స్ రంగంలో భారతదేశ పరివర్తనాత్మక ప్రస్థానాన్ని వివరిస్తూ.. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలతో ఈ రోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకొన్నారు. ఈ మార్గంలో నిరంతరంగా ముందుకు సాగిపోతుందనడానికి 'సెమీకాన్ ఇండియా 2025' ఒక ప్రతీకగా నిలిచిందని మంత్రి తన వ్యాసంలో పేర్కొన్నారు. ఈ వ్యాసంపై ప్రధానమంత్రి స్పందిస్తూ.. రాబోయే పదేళ్లలో భారత్ సెమీకండక్టర్ యూనిట్లు మరింతగా వృద్ధి చెంది దేశంలోని సంపూర్ణ సెమీకండక్టర్ ఆధారిత వ్యవస్థ గట్టి పోటీ ఇస్తూ ఎదుగుతుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర భారతదేశం అంతటా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక రాష్ట్రాలు నీట మునిగిపోయాయి. ఇక రాబోయే ఏడు రోజుల్లో దేశంలోని తూర్పు, మధ్య ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్ వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =